# లెప్రసీని ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్యం అందించాలి

- అంగవైకల్యం బారిన పడకుండా కాపాడొచ్చు
- వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డెరెక్టర్ జాన్‌బాబు
- ధారూరు, నవాబుపేట పీహెచ్‌సీల సందర్శన



ధారూరు : మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు

ధారూరు, సెప్టెంబర్ 30 : లెప్రసీ (కుష్టు) వ్యాధి లక్షణాలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం బారిన పడకుండా చూడొచ్చని రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. శనివారం ధారూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పీహెచ్‌సీలోని పలు రికార్డులు పరిశీలించారు. లెప్రసీ వ్యా ధికి సంబంధించిన రికార్డులను, గతంలో నిర్వహించిన రిరార్డులు, విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు 16 నుంచి ఈ నెల 30వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎల్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి గ్రామస్తులను గుర్తించేందుకు మండలంలో 21 బృందాలు 5,007 కుటుంబాల్లో 22,928 మందిని పరిశీలించి 12 మందిని గుర్తించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల టార్గెట్ 2030 వరకు లెప్రసీ రహిత తెలంగాణ, భారత్‌గా చేయడమేనని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు కు ష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాదికారి సుష్మాలక్ష్మి, ఈశ్వరయ్య, వెంకటేశ్వరాచారి, శ్రీనివాస్ రెడ్డి, జోసెఫ్, ఎంపీహెచ్ ఈవో వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగమణి, సురేందర్, స్వాతి, మాధవీలత, మల్లమ్మ, సంతోష, సువర్ణ, శోబారాణి పాల్గొన్నారు.

### నవాబుపేటలో..

నవాబుపేట : కుష్టువ్యాధి నివారణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు నవాబుపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగస్టు 16నుంచి 30 వరకు నిర్వహించిన ఎల్‌సీడీసీ కార్యక్రమాన్ని శనివారం జాన్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పనిచేసిన 34మంది టీం సభ్యుల ద్వారా ఆరోగ్యపరమైనా విషయాలు గ్రామాల్లో ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్ పీవో లెప్రసీ వైద్యుడు రవీందర్ యాదవ్, నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి రోహిత్ మిరియాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఎస్పీ కోటిరెడ్డి**



వికారాబాద్, సెప్టెంబర్ 30: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 31 వరకు ఈ ఉత్తర్వుల ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. డీజేలు, లౌడ్ స్పీకర్లు, ప్రసంగాలు అనుమతులు లేకపోతే నిషేధిస్తామని, జిల్లా ప్రజలు, ప్రతి నిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు ఈ విషయంలో సహకరించాలని సూచించారు.

# జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ప్రదీప్‌కుమార్



వికారాబాద్ ప్రభుత్వ దవాఖానల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాంచంద్రయ్య

వికారాబాద్, సెప్టెంబర్ 30 : వికారాబాద్ ప్రభుత్వ దవాఖానల సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రదీప్‌కుమార్‌ను జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థా నంలో వికారాబాద్ ప్రభుత్వ దవాఖానల సూపరింటెండెంట్‌గా రాంచంద్రయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులను డాక్టర్ ప్రదీప్‌కుమార్ శనివారం రాంచంద్రయ్యకు అందజేశారు. దీంతో దవాఖాన వైద్యులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

# గ్రామాల్లో ఢిల్లీ బృందం చిత్రీకరణ



కొత్లాపూర్‌లో కూలీల ఫొటో తీస్తున్న ఢిల్లీ బృందం

మర్పల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని కొత్లాపూర్, దార్గులపల్లి గ్రామాల్లో ఢిల్లీ బృందం ఎన్‌ఎఫ్‌డీసీ (జాతీయ ఫిల్మ్ డెవలఫ్‌మెంట్ కార్పొరేషన్) నుంచి అనుపమ్ శ్రీవస్తవ బృందం శనివారం పర్యటించి ఉపాధి హామీ పథకం అమలు జరుగుతున్న విధానాన్ని చిత్రీకరించింది. కొత్లాపూర్‌లో ఈజీఎస్ పనులకు సంబంధించి ఇంటింటి నుంచి వెళ్లే కూలీల కుటుంబాలను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. వారి ఆర్థిక పరిస్థితులు, పథకం ద్వారా లబ్ధిపొందుతున్న వివరాలు, జాబ్ కార్డు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. దార్గులపల్లిలో నిర్మించిన అమృత్ సరోవర్‌ను సందర్శించి వాటిని చిత్రీకరించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కమిషన్ కార్యాలయ సిబ్బంది కృష్ణమూర్తి, ఫొటోగ్రాఫర్ రవికుమార్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఏపీవో అంజిరెడ్డి, సర్పంచులు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

